ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

ఆదివారం 13 జూలై 2025

వయా మన్యం..

(కొత్తూరు టు ఒడిశా)



700 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద శ్రీకాకుళం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం తనిఖీ నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కడుమ నుంచి ఒడిశా రాష్ట్రం నవరంగపూర్‌కు వెళ్తున్న లారీ (ఏపీ39-యూయూ-4289)లో ఏకంగా 34,800 కిలోల పీడీఎస్ బియ్యం (700 బస్తాలు) పట్టుబడ్డాయి. వీటి విలువ రూ. 15,83,400 ఉంటుందని అధికారులు నిర్ధారించారు. కొత్తూరు మండలం కడుమలో గోవిందరావుకు చెందిన రైస్‌మిల్లు నుంచి ఈ బియ్యం సరఫరా అయినట్లు గుర్తించారు. పట్టుబడిన బియ్యాన్ని లారీతో సహా స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈసీ 6(ఏ), 7(1) సెక్షన్ కింద రైస్ మిల్లు యజమాని గోవిందరావు, లారీడ్రైవర్ మానేపల్లి వెంకటేష్‌పై కేసు నమోదు చేయాలని, వీరిపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌కు రాతపూర్వకంగా తెలియజేశారు. ఎస్ఐ రామారావు, పోలీసు కానిస్టేబుళ్లు పురుషోత్తమ్, తిరుపతిరావు, రెవెన్యూ అధికారి హేమలత, పాచిపెంట సీఎస్‌డీటీ తనిఖీల్లో పాల్గొన్నారు.



లారీలో పీడీఎస్ బియ్యం బస్తాలు

విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయడం.. పీడీఎస్ రైస్ పట్టుకోవడం.. రెవెన్యూ శాఖకు అప్పగించడం.. ఆ వెంటనే నాయకులు రగంలోకి దిగడం.. అధికారులపై ఒత్తిడి తేవడం.. తూతూమంత్రంగా కేసులు పెట్టడం.. అక్రమార్కులను రక్షించడం..!

ఇదీ తరచూ జరుగుతున్న తీరు. కొందరు నాయకుల అండదండలతో అక్రమార్కులు చెలరేగి పోతున్నారు. ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి.. మిల్లుల్లో పాలిష్ చేయించి.. జిల్లా సరిహద్దులు దాటించేస్తున్నారు. దొరికితేనే దొంగలు అన్న చందంగా విజిలెన్స్ దాడులు చేసినప్పుడే పట్టుబడుతున్నారు. తాజాగా కొత్తూరు మండలంలోని ఓ మిల్లు నుంచి అక్రమంగా తరలిన బియ్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న చర్చ సాగుతోంది.

- పార్వతీపురం జిల్లాలో భారీగా పట్టుబడిన పీడీఎస్ రైస్
- శ్రీకాకుళం జిల్లా కడుమ మిల్లు నుంచి రవాణా
- ప్రాథమికంగా గుర్తించిన విజిలెన్స్.. కేసు నమోదు
- నీరు గార్చేందుకు తెరవెనుక నాయకుల యత్నం

శ్రీకాకుళం/పాచిపెంట, జూలై 12(ఆంధ్రజ్యోతి):

రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరందుకుంది. కొంతమంది మిల్లర్లు ప్రధాన సూత్రధారులు వ్యవహరిస్తూ.. రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడుతున్నారు. తాజాగా పార్వతీపురం మన్యం జిల్లాలో విజిలెన్స్ అధికారులకు భారీగా రేషన్ బియ్యం పట్టుబడడం చర్చనీయాంశమవుతోంది. కొత్తూరు మండలం కడుమ నుంచి ఈ బియ్యం అక్రమ రవాణా సాగుతున్నట్టు అధికారులు గుర్తించడంతో అక్రమార్కుల్లో గుబులు రేగుతోంది. ప్రభుత్వం గతంలో రేషన్‌కార్డుదారులకు కిలో రూపాయి చొప్పున బియ్యం అందజేసేది. కరోనా వ్యాప్తి సమయం నుంచి ఒక్కో కార్డుదారుడికి ప్రతీనెలా (మిగతా 8వ పేజీలో..)



పి.కోనవలస వద్ద అధికారులకు పట్టుబడిన పీడీఎస్ బియ్యం లారీ



బారువ నుంచి మొక్కలను తెప్పించిన దృశ్యం

‘ఉపాధి’లో ఉద్యాన పంటలు

- 5 వేల ఎకరాల్లో కొబ్బరి మొక్కలు నాటేందుకు చర్యలు

గరుగుబిల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. 15 మండలాల పరిధిలోని చెరువులు, ప్రాజెక్టులు, పాఠశాలలు, ప్రభుత్వ స్థలాల్లో ఇలా సుమారు 5 వేల ఎకరాల్లో కొబ్బరి మొక్కలు నాటేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం జిల్లా బారువ మండలంలో ఉద్యాన నర్సరీల నుంచి మొక్కలు తెప్పిస్తున్నారు. ప్రతి మండలంలో 5 వేల మొక్కలు నాటేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే చెరువు గట్లు చదును చేయించారు. మండలాల వారీగా కేటాయించిన మొక్కలను ప్రత్యేక వాహనాలపై తరలిస్తున్నారు. నాటిన మొక్కలు సంరక్షణ భద్రతను వెలుగు గ్రామైక్య సంఘాలకు అప్పగించారు. ఆయా గ్రామ పరిధిలో కొబ్బరి చెట్లు నుంచి వచ్చిన ఫలసాయాన్ని సంఘాలకు అప్పగించనున్నారు. కొబ్బరితో పాటు మునగ, తదితర పలు రకాల మొక్కలను సరఫరా సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో మండలాలకు త్వరితగతిన మొక్కలు సరఫరా చేస్తున్నారు.

చర్యలు తప్పవు

మండలాల పరిధిలో గుర్తించిన ప్రాంతాల్లో కొబ్బరి మొక్కలను నిబంధనల మేర నాటించాలి. లేకుంటే ఉపాధి సిబ్బందిపై చర్యలు తప్పవు. గ్రామాల్లో నాటిన మొక్కలు వివరాలను వెలుగు సంఘాలకు అందించాలి. విధిగా పర్యవేక్షణ బాధ్యత చేపట్టాలి. మొక్కలు చుట్టూ కంచెలు ఏర్పాటు చేయించాలి. ప్రత్యేక వాహనాల్లో మొక్కలు తరలింపు వేగవంతం చేస్తున్నాం. నిర్దేశించిన సమయానికి వాటిని నాటించాలి.

- కె.రామచంద్రరావు, పీడీ, డ్వామా, పార్వతీపురం మన్యం

ప్రవేశాలు పెరగకుంటే.. వసతిగృహాలు మూసేస్తాం

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి
- జిల్లాలో చేరికలపై అసంతృప్తి

పార్వతీపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పిల్లల ప్రవేశాలపై మంత్రి బాల వీరాంజనేయ స్వామి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రవేశాలు పెరగకుంటే వసతిగృహాల మూసివేత తప్పదన్నారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..‘జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో 800 మంది పిల్లలు చేరాల్సి ఉంది. ఇప్పటివరకు 534 మాత్రమే చేరారు. క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం వల్ల వసతిగృహాలు మూతపడ కూడదు. పాఠశాలలకు, అవసరమైతే గ్రామాలకు వెళ్లి పిల్లలను హాస్టళ్లలో జాయిన్ చేయించాలి. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ట్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలి. త్వరలోనే విద్యార్థులకు కాస్మెటిక్ కిట్స్ అందిస్తాం. వసతి గృహాల్లో విషసర్పాలు ప్రవేశించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నాం. ఎక్కడైనా విషసర్పాల వల్ల విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే వార్డెన్లపై కఠిన చర్యలు తప్పవు. జిల్లాలోని గురుకులాలు, వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై రాజీపడొద్దు. జిల్లాలో ఎస్సీ వసతిగృహాల మరమ్మతులకు రూ.3కోట్లు మంజూరు చేశాం. హాస్టల్ ప్రాంగణంలో ఉండే పొదలను పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగించాలి. వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలి. విద్యార్థుల వద్ద సెల్‌ఫోన్ లేకుండా చూడాలి. వారికి అవసరమైన మేరకు మందులు ఇవ్వాలి. అనారోగ్యంతో బాధపడేవారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంటికి పంపించొద్దు. త్వరలోనే ప్రతి హాస్టల్‌కు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. ఇప్పటివరకు స్టాక్‌లో ఉన్న పాత బియ్యాన్ని వెనక్కి ఇచ్చి.. (మిగతా 8వ పేజీలో...)



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బాల వీరాంజనేయస్వామి

అమ్మో.. గజరాజులు

- గిజబ, గుండం పరిసరాల్లో సంచారం



గరుగుబిల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం గిజబ ప్రాంతంలో శనివారం గజరాజులు ప్రత్యక్షమయ్యాయి. శుక్రవారం నందివానివలసలో సంచరించిన తొమ్మిది ఏనుగులు మరోసారి గిజబలో హల్‌చల్ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ పనులకు ఆటంకం నెలకొందని వారు తెలియజేస్తున్నారు. వాటి కారణంగా నష్టం వాటిల్లిన పంటలకు నేటికీ పరిహారం అందలేదని మరికొందరు వాపోయారు. తక్షణమే సీతా నగరం మండలం గుచ్చిమిలో ఎలిఫెంట్ సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసి గజరాజులను అక్కడకు తరలించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

- సీతంపేట రూరల్: సీతంపేట, మొండింఖల్ సరిహద్దు ప్రాంతంలోని గుండంలో గజరాజులు సంచరిస్తున్నట్లు అటవీశాఖ బీట్ అధికారి దాలినాయుడు తెలిపారు. శనివారం ఉదయానికి వెదురువాడ కొండ ప్రాంతం నుంచి సరిహద్దు గ్రామమైన గుండం వైపు అవి కదిలినట్లు వెల్లడించారు. సీతంపేట ఏజెన్సీ నుంచి కురుపాం, గుమ్మలక్ష్మీపురం వైపు ఏనుగులు తరలి పోయినట్లు వెల్లడించారు. వాటిని ట్రాకర్స్ పర్య వేక్షిస్తున్నట్లు తెలిపారు. కాగా గజరాజులు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని గుండం పరిసర ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు.

కుళాయిల ద్వారా మురుగునీరు

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పర్యవేక్షణ లేక.. పొదలు తొలగించక

- పాలకొండ-పార్వతీపురం రోడ్డులో నడుకూరు వద్ద పొంచి ఉన్న ప్రమాదం

8 లో

పాకలు వేసి.. కంచె ఏర్పాటు చేసి

- గిజబ ప్రధాన రహదారికి ఆనుకుని ఆక్రమణలు
- పొలాలకు వెళ్లేందుకు రైతుల అవస్థలు

8 లో

కిలోమీటరు నడిచి.. కాశాయవలస చేరి

- సాలూరు న్యాయాధికారి హర్షవర్ధన్ పర్యటన

8 లో

విద్యాభివృద్ధికి కృషి: మంత్రి సంధ్యారాణి



బాగువలసలో విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి 8లో

శివారుకు అందితే సస్యశ్యామలమే!

- వెంగళరాయసాగర్ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు
- ఆగస్టు మొదటి వారంలో విడుదలకు సన్నాహాలు
- త్వరితగతిన కాలువ పనులు
- రైతుల్లో సందేహాలు
- చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించాలని విన్నపం

మక్కువ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మక్కువ మండలం శంబరలో ఉన్న వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్) నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆగస్టు మొదటి వారంలో సరఫరా చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బొబ్బిలి, మక్కువ, సీతానగరం మండలాల పరిధిలో ఆయకట్టు సంఘాలతో సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు, కాలువల స్థితిగతులు, సాగునీరు సరపరాలో ఎదు రయ్యే ఇబ్బందులను అడిగి తెలుసు కున్నారు. మరోవైపు మూడు మండ లాల్లో మొత్తంగా 24,700 ఎకరాలకు సాగునీరందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖరీఫ్ రైతులకు ఎటువంటి కలగకుండా శివారు భూములకు పూర్తిస్థాయిలో నీరు అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.



నీటి నిల్వలతో నిండుగా కనిపిస్తున్న వెంగళరాయసాగర్

శివారుకు అందట్లే..

ప్రాజెక్టు సామర్థ్యం 161 మీటర్లు కాగా ప్రస్తుతం 160.2 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి. కుడి ప్రధాన కాలువ ద్వారా సుమారు 16వేల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 8వేల ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. అయితే ఆయకట్టు శివారు భూములకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. వీఆర్ఎస్‌లో పూర్తిస్థాయిలో నీటి నిల్వలు ఉన్నందున సాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

చురుగ్గా పూడికతీత పనులు

వీఆర్ఎస్ ప్రాజెక్టు ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మక్కువ మండలంలో ఆరు పనులకు రూ.26లక్షలు మంజూరు కాగా.. త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జైకా (మిగతా 8వ పేజీలో...)

ఎరువుల దుకాణదారుల సమస్యలు పరిష్కరిస్తా

● చీపురుపల్లి ఎమ్మెల్యే కళా



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న ఎరువుల దుకాణాల నిర్వాహకులు

రాజాం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణదారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు హామీఇచ్చారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల ఎరువుల దుకాణదారులు శనివారం రాజాం క్యాంపు కార్యాలయంలో ఆయన్ని కలిసి, వినతిపత్రం అందజేశారు. ఎరువుల అమ్మకంలో పలు ఇబ్బందులు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లి, న్యాయం చేస్తామని కళా వెంకటరావు హామీ ఇచ్చారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

విజయనగరం క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విజయనగరం సబ్ డివిజన్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, రోడ్‌షోలు నిర్వహించాలంటే సంబంధిత వ్యక్తులు ముందస్తుగా పోలీసుశాఖ అనుమతి పొందాలని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు చట్టం 1861లోని సెక్షన్-30 నెల రోజులపాటు అమలులో ఉంటుందన్నారు. ఈ చట్టం ప్రకారం ఊరేగింపులు, బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు మొదలైన వాటి నిర్వహణకు ముందస్తు అనుమతులు తప్పనిసరన్నారు.

● రాజాం రూరల్, జులై 12 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అనుమతి లేని ఊరేగింపులు, ప్రజా సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిషేధమని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు స్పష్టం చేశారు. ఆయన శనివారం మాట్లాడుతూ పోలీస్ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడిగా వంగా

రాజాం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు వంగా గోవిందరావును రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 11న ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతో పాటు ఇద్దరు సభ్యుల్ని కూడా నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. గతంలో రెండు సార్లు రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడిగా గోవిందరావు పనిచేశారు.

నేడు రక్తదాన శిబిరం

జామి, జూలై 12(ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తం అందజేసే నిమిత్తం ఆదివారం కుమారాం గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ గ్రామ యువకులు తెలిపారు. వారు శనివారం మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రక్తదాతలు పాల్గొనాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

లక్కవరపుకోట, జూలై 12(ఆంధ్రజ్యోతి): లక్కవరపుకోటలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం 15 మంది లబ్ధిదారులకు రూ.11లక్షల 9వేల 363 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేబీపీ రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, జీఎస్.నాయుడు, కోళ్ల శ్రీను, గొరపల్లి రాము, ఉమేష్ పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఇన్‌చార్జి అందుబాటులో ఉంటున్నారు

శృంగవరపుకోట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ కార్యకర్తలందరికీ అందుబాటులో ఉంటున్నారని స్థానిక నాయకులు తాండ్రంగి చంటి, మోపాడ కృష్ణ, దొగ్గ రమణ, పిల్లా రామదుర్గ, మల్లువలస శ్రీను, తూర్పాటి రాము తెలిపారు. శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. అధినేత పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా మిత్ర ధర్మాన్ని పాటిస్తున్నారని స్పష్టం చేశారు. ఐక్యంగా ఉన్న కార్యకర్తల మధ్య మనస్పర్థలు సృష్టించడం మంచిపద్ధతి కాదని హితవుపలికారు.

చినగుడిపాలలో పశు వైద్య శిబిరం

వేపాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చినగుడిపాల గ్రామంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 56 పాడి పశువులకు వైద్య చికిత్సలు నిర్వహించినట్టు వేపాడ పశువైద్య కేంద్ర వైద్యాధికారి గాయత్రీ తెలిపారు. అవసరమైనవాటికి ఉచితంగా మందులు అందజేశామని చెప్పారు.

టీకాలు వేయించడంలో నిర్లక్ష్యం వద్దు

శృంగవరపుకోట రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు టీకాలు వేయించడంలో నిర్లక్ష్యం వద్దని బొడ్డవర పీహెచ్‌సీ వైద్యురాలు మానస అన్నారు. శనివారం దారపర్తి గిరిశిఖర గ్రామాల్లో చిన్నారులకు సీహెచ్‌వో వేణుగోపాల్ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. కార్యక్రమంలో హెచ్ఎస్ వెంకటరమణ, వైద్య సిబ్బంది వున్నారు.

ప్రభుత్వం మారినా.. మారని పేర్లు

● కార్యాలయ భవనాలపై పాత పేర్లు దర్శనమిస్తున్న వైనం



రావివలసలో రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ పేరుతో ఉన్న భవనాలు

భోగాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి ఏడాది అవుతున్నా కొన్ని కార్యాలయాలపై గత ప్రభుత్వానికి సంబంధించిన పేర్లు దర్శనమివ్వడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. గతంలో ఉండే రైతు భరోసా కేంద్రం.. ప్రస్తుతం రైతు సేవా కేంద్రంగా, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్.. ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌గా మార్పు చేయాల్సి ఉంది. అయితే భోగాపురం మండలంలో పలు చోట్ల ఆయా కార్యాలయాల పేర్లు ఇప్పటికీ అలాగే దర్శనమిస్తున్నాయి. దీనిపై ఎంపీడీవో కిశోర్‌కుమార్‌ని వివరణ కోరగా ఏ శాఖకు సంబంధించిన వారు ఆయా కార్యాలయాల పేర్లు మార్పు చేసుకోవాలన్నారు. లేనిచో తామే పేర్లు మార్పు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముహూర్తం ఖరారు

● 25న విజయనగరం ఏఎంసీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఏఎంసీ పాలకవర్గ సభ్యులు

విజయనగరం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కొలువు దీరేందుకు ముహూర్తం ఖరారు అయ్యింది. పది రోజుల కిందట పాలకవర్గానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రస్తుతం ఆషాడమాసం కావడంతో పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం విషయంపై కొద్ది రోజుల కిందట ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన కర్రోతు నర్సింగరావు నివాసంలో సమాలోచనలు జరిపారు. ఈనెల 24 వరకూ ఆషాఢ మాసం ఉన్న నేపథ్యంలో 25న శ్రావణమాస తొలి శుక్రవారం బాధ్యతల స్వీకరణ చేస్తే బాగుంటుందని అనుకున్నారు. ఈ మేరకు శనివారం ఉదయం టీడీపీ నేత అశోక్ గజపతిరాజుని ఆయన నివాసంలో, ఎమ్మెల్యే అదితి గజపతిరాజును బంగ్లా ఆవరణలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపి నోటుపుస్తకాలు అందజేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం తేదీ విషయమై చర్చించారు. ఈనెల 25వ తేదీ శుక్రవారం వారిద్దరూ అందుబాటులో ఉన్నంటున్న నేపథ్యంలో అదేరోజు ముహూర్తంగా నిర్ణయించారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..

విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈనెల 25న ఉదయం 10 గంటలకు ఏఎంసీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్టు చైర్మన్ కర్రోతు నర్సింగరావు చెప్పారు. శనివారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అశోక్ గజపతిరాజు, అదితి గజపతిరాజు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారన్నారు. విజయనగరం నియోజకవర్గంలోని నగరం, మండల పరిధిలోని అన్ని డివిజన్లు, గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కూటమి పాలనలో సుఖ సంతోషాలు

● ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో ఉన్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం గనిశెట్టిపాలెం గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోళ్ల వెంకటరమణ, గొరపల్లి రాము, కనకాల శివ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యం

● రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు



గుడివాడలో కరపత్రాలు అందజేస్తున్న బంగార్రాజు

భోగాపురం, జూలై12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సాగిందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. గుడివాడ గ్రామంలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై వివరించారు. సర్పంచ్ చిల్ల జమున, నాయకులు దాసరి అప్పలస్వామి, కొండపు ఈశ్వరరావు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కెరీర్‌పై గైడెన్స్‌పై అవగాహన కల్పించాలి

● బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ




ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

నెల్లిమర్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు కెరీర్ గైడెన్స్‌పై సమగ్రంగా అవగాహన కల్పించాలని బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శనివారం నెల్లిమర్లలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల, ఏపీ బీసీ బాలుర (ఫిషర్‌మెన్) గురుకుల పాఠశాలలను సందర్శించారు. ముందుగా ఆయన బాలుర గురుకుల పాఠశాలలో స్టోర్ గదిని, వంట గదిని పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. తాను అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు అవగాహన లేని సమాధానం చెప్పారు. దీంతో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆయన అన్నారు. సిబ్బంది పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రాలను అందించారు. బీసీ సంక్షేమ శాఖ జేడీ చినబాబు, విజయనగరం, అనకాపల్లి జిల్లాల బీసీ సంక్షేమశాఖ అధికారులు జ్యోతిశ్రీ, శ్రీదేవి, జిల్లా బీసీ గురుకుల పాఠశాలల కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు, ఫిషర్మన్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ త్రినాథరావు, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్, ఫిషర్మన్ పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

రేగిడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు సకాలంలో చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్రావు, సురేష్‌కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రేగిడి మండల కేంద్రంలో రాజాం నియోజకవర్గ మండలాల ఫీల్డ్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గ ఎంపిక, వారి సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నేతలు పాల్గొని, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై చర్చించారు. మూడు నెలల జీత భత్యాలు పెండింగ్, ఉద్యోగ భద్రత లేమి, టార్గట్ విధానం రద్దు తదితర సమస్యలు పరిష్కారించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రత్యేక తీర్మానం ఆమోదించారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రతినిధులు లక్ష్మణరావు, జగన్నాథనాయుడు, సూజాత, లక్ష్మి, లావణ్య, తమ్మినాయుడు, నరిసింహరావు, గంగరాజు, పోలినాయుడు, ఆదినారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

చట్ట ప్రకారమే.. అనడం బాధాకరం



జిందాల్ షేర్‌హోల్డర్స్ ఇచ్చిన పేపర్‌ను చూపిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట రూరల్ జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితులకు అంతా చట్ట ప్రకారమే జరుగుతుందని అంతకు మించి ఇంకా ఏం చేయలేమని కలెక్టర్ పేర్కొనడం బాధాకరమని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శనివారం బొడ్డవర గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. 2008లో కిల్తంపాలెం నవోదయ విద్యాలయంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ మినిట్స్ ఒక్కసారి చదవాలని కోరారు. దాని ప్రకారమే వారికి న్యాయం చేయాలన్నారు. జిందాల్ నిర్వాసితుల పట్ల అటూ ప్రజాప్రతినిధులు, ఇటు అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. జిందాల్ కంపెనీ ప్రతినిధులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు నిర్వాసితులతో ఒక్క సమావేశం నిర్వహిస్తే ఈ సమస్య చిటికెలో తేలిపోతుందన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి రైతుల పక్షాన నిలిచి వారికి ఎలా న్యాయం చేశారో జిందాల్ నిర్వాసితులకు అదే చేయాలని కోరుతున్నామన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రితో పాటు మంత్రి లోకేశ్ అపాయింట్‌మెంట్ కోరామని, అంగీకారం వచ్చిన వెంటనే వారిని కలిసి, సమస్య వివరిస్తామన్నారు. అంతా చట్టప్రకారం అంటున్న కలెక్టర్.. 18 ఏళ్ల కిందట జిందాల్ ఇచ్చిన పరిహారం రైతులు వెనక్కి ఇచ్చేస్తే వారి భూములు ఇప్పిస్తారా.. ఆయన కోరారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

● ప్లీనరీ సమావేశాలు ప్రారంభం



మాట్లాడుతున్న రామ్మోహన్

విజయనగరం దాసన్నపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం రద్దు అయ్యే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు నగరంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానంతో అనేక మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. పాఠశాలలు మూతపడ్డాయన్నారు. అలాగే జీవో నెం.77ను రద్దు చేయాలని, వసతిగృహ భవనాలు నిర్మించాలని, మెస్ చార్జీలు పెంచాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రాము, వెంకటేష్, శిరీష, రాజు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వకపోతే నీరు విడిచిపెట్టేది లేదు

● పంప్‌హౌస్‌ల వద్ద ఆపరేటర్ల ఆందోళన



బొడ్డవలస పంప్‌హౌస్ వద్ద నిరసన చేస్తున్న ఆపరేటర్లు

రేగిడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రేగిడి, సంతకవిటి మండలాల పంప్‌హౌస్ ఆపరేటర్లు నిరసన బాట పట్టారు. బొడ్డవలస, జావాం పంప్‌హౌస్‌ల వద్ద రెండు మండలాల ఆపరేటర్లు శనివారం వేర్వేరుగా ఆందోళన చేపట్టారు. తమకు ఏడు నెలలుగా జీతాలు చెల్లించకుంటా గొడ్డు చాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీతాలు చెల్లించాలని, లేకపోతే శుక్రవారం నుంచి పంపింగ్ బంద్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసనలో రేగిడి, సంతకవిటి మండలాల ఆపరేటర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి మధ్యలో గొయ్యి

● పొంచి ఉన్న ప్రమాదం

● పట్టించుకోని అధికారులు



రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

భోగాపురం, జూలై12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సవరవల్లి నుంచి బసవపాలెం వెళ్లే జంక్షన్ వద్ద జాతీయరహదారి మధ్యలో ప్రమాదకరంగా గొయ్యి ఉంది. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్లే సర్వీస్ రహదారిలో పక్కన కాలువ ఏర్పాటు చేసి దానిపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేశారు. అలాగే జంక్షన్ పరిధిలో సర్వీస్ రహదారి బసవపాలెం వెళ్లే జంక్షన్ పూర్తిగా బీటీ రహదారిగా అభివృద్ధి చేశారు. అయితే కాలువపై ఉన్న సిమెంటు పలక పగిలి కూలిపోవడంతో అక్కడ ప్రమాకరంగా గొయ్యి ఏర్పడింది. ఈ రహదారి నుంచి బసవపాలెం, కవులవాడ, జమ్మయ్యపేట, ప్రైవేటు రిసార్టుకు నిరంతరం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఆ గొయ్యి కారణంగా వాహన చోదకులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా జాతీయరహదారి అధికారులు స్పందించి గొయ్యపై కూలిన సిమెంటు పలకలు తొలగించి కొత్త పలకలు ఏర్పాటు చెయ్యాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరో నలుగురికి గాయాలు



సుధీర్(ఫైల్)

శృంగవరపుకోట రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ నవోదయ విద్యాలయం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా, మరో నలుగురు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. లచ్చందొరపాలెం గ్రామానికి చెందిన కండేపల్లి సుధీర్(18) తన స్నేహితులతో బొడ్డవర పంచాయతీ అంబదాసుపాలెం గ్రామానికి చెందిన నిఖిల్ ఆటోలో ముషిడిపల్లి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో నవోదయ విద్యాలయం దాటగానే ఎదురుగా వస్తున్న వ్యాను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధీర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో నడుపుతున్న నిఖిల్‌తో పాటు గణేష్, జగదీష్‌లు గాయపడ్డారు. వీరిని వెంటనే ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో గణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. సుదీర్ తల్లిదండ్రులు దేముడు, చంద్రకళ దినసరి కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి సుదీర్‌తో పాటు ఇద్దరి కూతుర్లు ఉన్నారు. సుదీర్ ఇటీవల ఇంటర్ ఉత్తీర్ణత సాధించడంతో ఎస్.కోట ఐటీఐలో చేరాడు. ఈ ప్రమాదంలో వ్యాను డ్రైవర్ అంజికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణా రాష్ట్రం వరంగల్‌కు చెందిన ఈయన ఎలక్ట్రికల్ టవర్లు బాగు చేసేందుకు ఇక్కడకు రాగా, ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈయన్ని విజయనగరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని ఒకరు..



అప్పాలు(ఫైల్)

గజపతినగరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకుని ఒకరు మృతిచెందిన ఘటన గజపతినగరం, మరుపల్లి గ్రామాల మధ్య శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బొబ్బిలి రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని భూదేవిపేట గ్రామానికి చెందిన గందవరపు అప్పాలు(60) అనారోగ్య కారణంగా మరుపల్లి పీహెచ్‌సీకి వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న గూడ్స్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అప్పాలు అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఇటీవలే మృతిచెందింది. మృతుడు ఆ గ్రామ ఇలవేల్పు అయిన మరిడమ్మతల్లి ఉత్సవాల్లో పూజారిగా ఉండేవాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

పూసపాటిరేగ, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిప్పలవలస గ్రామంలో రాయితి ఎర్రయ్య ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన 40.21 క్వింటాళ్ల బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని ఇక్కడ అక్రమంగా నిల్వ చేస్తున్నారంటూ అందిన సమాచారం మేరకు భోగాపురం సీఎస్ డీటీ మురళి తోపాటు రాజాం, గజపతినగరం, గంట్యాలకు చెందిన సీఎస్ డీటీలు, స్థానిక వీఆర్వో టి.ఈశ్వరరావులు దాడులు నిర్వహించి, వీటిని పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన వారిపై 6ఏ కేసు నమోదుచేసి, బియ్యాన్ని భోగాపురం ఎంఎల్‌సీపాయింట్‌కు అప్పగించినట్టు సీఎస్‌డీటీ మురళి తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

గుర్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఎస్ఆర్ పేట సమీపంలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ పి.నారాయణరావు శనివారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో తారకరామ ప్రాజెక్టు కాలువ గట్టు, మణిపురిపేట గ్రామం వద్ద తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఈ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా, వారి నుంచి కేజీ గంజాయి, ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్, ఒక మొబైల్ ఫోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

నెంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తాం



సీజ్ చేసిన వాహనాలను చూపిస్తున్న సీఐ

రాజాం రూరల్, జులై 12 (ఆంధ్రజ్యోతి): నెంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రవాణా శాఖ నిబంధనల మేరకు ప్రతి వాహనానికి కచ్చితంగా నిర్ణీత నమూనాలో నెంబర్ ప్లేట్ తప్పనిసరని ఆయన స్పష్టం చేశారు. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న డ్రైవ్‌లో నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఆయా వాహనాలకు సంబంధించిన పత్రాలు చూపించి, నెంబర్ ప్లేట్‌తో వస్తే వాహనాలను తిరిగి యజమానులకు అప్పగిస్తామన్నారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను తమ వెంట తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సంతకవిటి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సంతకవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టుకు సంబంధించి గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.భవాని తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాలకు దరఖాస్తు అందజేయాలని చెప్పారు. అభ్యర్థులు ఈనెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ● గంట్యాడ: గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్ పోస్టుకు గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 15 లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఉత్తమ పాలన అందించడమే లక్ష్యం

● సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి

పార్వతీపురం/పార్వతీపురం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉత్తమ పాలన అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం పార్వతీపురంలోని జగన్నాథపురంలోని ఒకటి, 30వ వార్డుల్లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొన్నారు. అనంతరం బాల వీరాంజనేయస్వామి విలేకరులతో మాట్లాడుతూ ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. కాగా పాత్రుడుకోనేరు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, జగన్నాథపురానికి చెందిన రైతులు మంత్రితో పాటు ఎమ్మెల్యే విజయచంద్రను కోరారు. జిల్లా కేంద్రం, మునిసిపాలిటీగా ఏర్పడక ముందు పాత్రుడు కోనేరు నీరు తాగేవారమని, కోనేరు అక్రమణలకు గురైయ్యిందని మంత్రి ముందు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోనేరు గట్టును ఉద్యావన కేంద్రంగా అభివృద్ధి చేసి, గతంలా జగన్నాథపురం ప్రజలకు ఉపయోగపడేలా తయారుచేయాలని మంత్రిని కోరారు. దీంతో మంత్రి స్పందిస్తూ ఎమ్మెల్యే విజయచంద్రతోపాటు సంబంధిత అధికారులు పూర్వాపరాలను పరిశీలించి న్యాయం చేస్తారని హామీఇచ్చారు.విశ్వబ్రాహ్మణుల సమస్య పరిష్కరించాలని పట్టణ స్వర్ణకార సంఘ నాయకులు బి.రంగారావు ఆధ్వర్యంలో సభ్యులు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సీతానగరం, జూలై 12(ఆంధ్రజ్యోతి):రాష్ట్రప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టిసారించిందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలకోసం ప్రత్యేక శ్రద్ధతీసుకుంటుందని మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి తెలిపారు. జోగింపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల తరగతి, వంట గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. బాత్ రూములు, స్నానపు గదులు పాడవడంతో తక్షణమే శుభ్రపరచాలని ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావుకు సూచించారు.పదో తరగతి, ఇంటర్‌విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు అందిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపవతి, ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు, నాయకులు వెంకటనాయుడు, పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. నిడగల్లులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు, కార్యదర్శులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

పార్వతీపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):దివ్యాంగుల సమస్యలు వెం టనే పరిష్కరించాలని అధికారులను మంత్రి బాలవీరాంజనేయులు ఆదేశించారు. పార్వతీపురంలో ఆ శాఖ ఉద్యోగులు, దివ్యాంగులు పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.కొంతమంది దివ్యాంగులు తమశాఖకు సంబంధించి సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరారు. మరికొంతమంది తమకు పింఛన్లు మంజూరు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలను అందించారు.



పార్వతీపురం/పార్వతీపురం టౌన్:జగన్నాథపురంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు వింటున్న మంత్రి బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే విజయచంద్ర

కలెక్టర్‌కు అభినందన

వసతిగృహాల్లో విద్యార్థులకు వసతులు కల్పించేందుకు సీఎస్ఆర్ ద్వారా నిధులు సమకూర్చి ఏర్పాటు చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్‌ను మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి అభినందించారు. జిల్లా అధికారయంత్రాంగం చర్యతీసుకోవడం అభినందనీయమని, కలెక్టర్‌తో పాటు అధికారులందరినీ అభినందిస్తున్నానని మం త్రి పేర్కొన్నారు.

పాకలు వేసి.. కంచె ఏర్పాటుచేసి

● పొలాలకు వెళ్లేందుకు రైతుల అవస్థలు ● గిజబ ప్రధాన రహదారికి ఆనుకుని ఆక్రమణలు

గిజబలో కొందరు వక్తులు ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమించి పాకలు వేయడంతోపాటు కంచె సైతం ఏర్పాటుచేశారు. నిత్యం వందలాది మంది పంట పొలాలకు వెళ్లే మార్గం ఆక్రమించడంతో రైతులు అగచాట్లకు గురవుతున్నారు. ఇక్కడ ఆక్రమణల విషయం పలుసార్లు రెవెన్యూ అధికారుల తీసుకువెళ్లినా స్పందించడంలేదని స్థానికులు వాపోతున్నారు.

గరుగుబిల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిజబ ప్రధాన రహదారికి ఆనుకుని ఆర్‌అండ్‌బీకి చెందిన స్థలం యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు నియంత్రించడలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలపై పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందిం చడం లేదని వాపోతున్నారు.ప్రధాన రహదారికి ఆనుకుని పంచాయతీ పరిధిలో సీసీ డ్రెయిన్లు, వాటిపై ఏర్పాటుచేసిన పైకప్పులు సైతం ఆ క్రమించేశారు. పంట పొలాలకు వెళ్లేందుకు వీలుగా రహదారికి ఆనుకుని ఉండే ఆ స్థలాన్నిసైతం పలువురు ఆక్రమించి దుకాణాలు,పాకలు ఏర్పాటు చేసుకోవడం విశేషం. దీంతో పంటపొలాలకు వెళ్లేందుకు మార్గం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కబ్జా చేసిన స్థలాలను సొంతవిగా భావించి తమపై దాడులకు దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

గిజబ ప్రధాన రహదానికి ఆనుకుని ఆక్రమణలు జరిగాయని రైతులు ఫిర్యాదు చేశారని తహసీల్దార్ పి.బాల తెలిపారు. ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మాణాల విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు అందించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించామని చెప్పారు. ఆక్రమణదారులు మొండికేస్తే తొలగిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం అందించామని, నిబంధనలు ధిక్కరించే వారిపై చర్యలు చేపట్టాలని కోరామని తెలిపారు.



గిజబ రహదారికి ఆనుకుని కంచె వేసిన ఆక్రమణదారులు

కిలోమీటరు నడిచి.. కాశాయవలస చేరి

● గిరిశిఖర గ్రామంలో సాలూరు న్యాయాధికారి హర్షవర్ధన్ పర్యటన

సాలూరు రూరల్,జూలై 12 (ఆంధ్రజ్యోతి):ఎగువ కాశాయవలస గిరిశిఖర గ్రామంలో సాలూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి, స్థానిక లీగల్ సెల్ అథారిటీ ఛైర్మన్ హర్షవర్ధన్ శనివారం పర్యటించారు. ఇటీవల ఆశా వర్కర్ శ్యామల డోలీ మోతతో ఆసుపత్రిలో చేరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ సూచన మేరకు ఆయన గ్రామాన్ని పరిశీలించారు. గ్రామానికి చేరుకోవడానికి ఏవోబీలో 26వ నెంబర్ జాతీయరహదారిపై రోడ్డవలస వరకు, అక్కడ నుంచి కరడవలసకు వాహనంలో చేరుకున్నారు. కరడవలస నుంచి కిలోమీటరుపైగా ఆయన నడిచి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఆశా వర్కర్ శ్యామల,గ్రామస్థులతో మాట్లాడారు. తాగునీరు,విద్యుత్,వైద్యం,విద్య,రోడ్డు తదితర మౌళిక సదుపాయలపై వారిని అడిగి తెలుసుకున్నారు. వారిచ్చిన సమాధానాలతో నివేదిక రూపొందించి రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీకి నివేదించనున్నారు.



ఎగువ కాశాయవలస గ్రామస్థులతో మాట్లాడుతున్న హర్షవర్ధన్

కురుపాంలో వైద్య శిబిరం

కురుపాం,జూలై12(ఆంధ్రజ్యోతి): కురుపాంలోని గౌడువీధి, గాంధీనగర్‌లో రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీకటి శంకరరావు ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. జ్వరాలపై అవగాహనకల్పించి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కుళాయిల ద్వారా మురుగునీరు

పాలకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పాలకొండనగరపంచాయతీలోగల వడమ రక్షిత పథకం పరిధిలో కుళాయిల ద్వారా రెండురోజులుగా మురుగునీరు సరఫరా అవుతోంది. శనివారం కూడా మురుగునీరు రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఎప్పటికప్పుడు రంగుమారిన, నలకలతో కూడిన నీరు సరఫరాఅవుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో వడమతో పాటు నక్కలపేటసాయిదుర్గానగర్ తదితర ప్రాంతాల్లో మురుగునీరు రావడంతో ఇబ్బందులుపడుతున్నారు.



మురుగునీరు వస్తున్న దృశ్యం

వయా మన్యం

(కొత్తూరు టు ఒడిశా)

(ఐదో పేజీ తరువాయి)

ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోంది. చాలా మంది లబ్ధిదారులు సన్నబియ్యానికి అలవాటు పడి.. వీటిని వినియోగించడం లేదు. రేషన్ బియ్యాన్ని కిలో రూ.20 నుంచి రూ.22 చొప్పున వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వీటిని ఆయా వ్యాపారులు.. మిల్లర్లకు గంపగుత్తగా మరికొంత లాభం వేసుకుని విక్రయిస్తున్నారు. ఆ చౌక బియ్యాన్ని మిల్లర్లు ఇతర రాష్ట్రాలకు పంపి.. డబ్బులు సంపాదిస్తున్నారు. రెండేళ్ల కిందట శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేట మండలం స్కాట్‌పేట నుంచి ఏకంగా ఆర్టీసీ పార్శిల్ వాహనంలోనే తరలిస్తున్న పీడీఎస్ రైస్‌ను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదులో చూపించిన ఉత్సాహం.. ఆ తర్వాత ఏమైందో.. నిందితులకు శిక్ష పడిందా? లేదా అన్నదీ అధికారులు వెల్లడించడంలేదు. ఇప్పుడు పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన చౌకబియ్యం కడుమ మిల్లు నుంచి వచ్చాయని విజిలెన్స్ అధికారులే ప్రకటించారు. కాగా అసలు ఆ బియ్యం ఎక్కడ నుంచి కొనుగోలు చేశారు..? వాటిని రీసైక్లింగ్ ఎక్కడ జరిగింది..? అలాగే.. లారీతో బియ్యం తరలింపుతో మూడు రకాల బిల్లులను ఎందుకు ఇచ్చారు..? దీనివెనుక ఉన్న వ్యక్తులకు రాజకీయ నాయకులతో లింకులేమిటన్నది తేలాల్సి ఉంది. కొంతమంది మిల్లర్లు ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి వెనుక ఉంటూ.. ఇటువంటి వ్యాపారాలకు తెరతీస్తున్నారు. శనివారం విజిలెన్స్ అధికారులు బియ్యాన్ని పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించేశారు. ఆ తర్వాత సీఎస్‌డీటీ(కొత్తూరు) ఆధ్వర్యంలో కడుమ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. కొంతమంది నుంచి.. మరొక మిల్లు రెన్యువల్ ముగిసిందని.. అందుకే ఇక్కడ నుంచి పంపుతున్నామంటూ మిల్లర్లు స్టేట్‌మెంట్ ఇచ్చారు. వీటన్నింటినీ అధికారులు నమోదు చేసుకున్నారు. కానీ ఈ కేసును నీరుగార్చేందుకుగాను.. సదరు మిల్లరు బడానాయకుల వద్దకు వెళ్లి మంతనాలు చేసినట్టు సమాచారం. జిల్లాలో అప్పుడప్పుడు రేషన్ బియ్యం భారీగా పట్టుబడటం.. ఆతర్వాత మొక్కుబడిగా విచారణ జరిగేలా.. చేయడం షరామామూలేనన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా పట్టుబడిన బియ్యం కేసు కూడా ఇలానే ఉంటుందా..? అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. పీడీఎస్ బియ్యం రవాణా సూత్రధారులపై కఠిన చర్యలుంటేనే అక్రమాలకు చెక్ పడుతుందని పలువురు భావిస్తున్నారు

ప్రవేశాలు పెరగకుంటే.. వసతిగృహాలు మూసేస్తాం

(5వ పేజీ తరువాయి)

ఫోర్టిఫైడ్ నాణ్యమైన రైస్‌ను వసతిగృహాలకు తీసుకెళ్లాలి. విద్యార్థులకు దుప్పట్లు, కంచాలు, గ్లాసులు, పాఠ్యపుస్తకాలను పూర్తిస్థాయిలో అందించాలి. కుక్‌లకు శిక్షణ ఇవ్వాలి. విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు జిల్లా సంక్షేమ ఆరోగ్యాధికారిని నియమించాలి. మలేరియా, అనీమియా, న్యూట్రిషన్ సమస్యలపై దృష్టిసారించి మంచి వైద్యం, పోషకాహారం అందించాలి. త్వరలోనే విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలో ఐఏఎస్ కోచింగ్ సెంటర్లు ప్రారంభిస్తాం. మరికొంతమంది అభ్యర్థులకు లాంగ్‌టర్మ్ శిక్షణ కూడా అందిస్తాం. ఇప్పటికే అనేక మంది ఎంబీబీఎస్ తదితర ఉన్నత విద్యలో సీట్లు సాధించారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు జర్మనీ భాషలో శిక్షణ ఇచ్చి ఆ దేశంలో ఉపాధి కల్పిస్తాం.' అని తెలిపారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో వసతిగృహం నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేస్తు న్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, జేసీ శోభిక, సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ, డీఆర్వో కె.హేమలత, ఉమ్మడి జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారులు అప్పన్న, అన్నపూర్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

శివారుకు అందితే సస్యశ్యామలమే!

(5వ పేజీ తరువాయి)

నిధులతో కుడి కాలువలో 4 కిలోమీటర్లు, ఎడమ ప్రధాన కాలువలో 2కిలోమీటర్ల పరిధిలో లైనింగ్ పనులు పూర్తి చేశారు. బొబ్బిలి మండలంలో 12పనులు చేపడుతున్నారు. రూ.55 లక్షలతో వివిధ బ్రాంచి ఉపకాలువల్లో 15 పనులు పూర్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల మొదటి వారంలో సాగునీటిని విడుదలకు చర్యలు తీసుకుంటున్నామని ప్రాజెక్టు ఈఈ ప్రదీప్ తెలిపారు. అన్ని కాలువల్లో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేస్తున్నామన్నారు.

గంజాయి నిరోధానికి చర్యలు: డీఎస్పీ

రామభద్రపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా నిరో ధానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని ఎనుబరువు సమీపంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవేపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒడిశా నుంచి ఎక్కువగా గంజాయి అక్రమరవాణా జరుగుతున్న దృష్ట్యా గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద చెక్‌పోస్టు ఏర్పాటుచేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే కొట్టిక్కి చెక్‌పోస్టు వద్ద 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రధానంగా మాదకద్రవ్యాల నిరోధానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసు కుంటోందని, ఇందులో భాగంగా గంజాయి నిల్వ ఉంచినా, రవాణా చేసినా వారిపై కఠిన మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీటితొట్టెల పరిశీలన

బొబ్బిలి రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివడవలసలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణాలు చేపట్టిన నీటి తొట్టెలు, వ్యవసాయ చెరువులు, గోకులాలను క్షేత్రస్థాయిలో ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. బొబ్బిలి డివిజన్‌లో జాతీయ స్థాయి మానిటర్ (ఎన్ ఎల్ఎమ్) బృందం సోమవారం పర్యటన పురస్కరించుకొని ముందస్తుగా పరిశీ లించి రైతులతో మాట్లాడారు. నీటి తొట్టెలు నిర్మాణం జరిగిన ప్రదేశాలకు వెళ్లి, అక్కడ రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో మూగ జీవుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్టెలు,పొలాలు, తోటల్లో నిర్మించిన వ్యవసాయ చెరు వుల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్య క్రమంలో ఏపీవో లక్ష్మీపతిరాజు, ఎంసీవో సుధాకర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

20న పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నిక

బొబ్బిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి ఎన్‌జీఓ హోమ్‌లో ఈనెల 20నపంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ బొబ్బిలి తాలూకా యూనిట్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జొన్నాడ విక్టర్, చుక్క శ్రీనివాసరావు తెలిపారు. సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆసక్తి ఉన్న వారు అదేరోజు ఉదయం తొమ్మిది గంటలకు నామినేషన్లను దాఖలు చేయ వచ్చని తెలిపారు. 11 నుంచి 12.30 గంటల వరకు ఎన్నిక ప్రక్రియ జరుగుతుం దని చెప్పారు.

విద్యాభివృద్ధికి కృషి: మంత్రి

సాలూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బాగువలస జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో మార్పును తీసుకురాగలవన్నారు. కార్యక్రమంలో డీఈవో రాజ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు పరమేశు, నాయకులు మరిపి సింహాచలం, మత్స శ్యామ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



వినతిని స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యలు పరిష్కారమే ప్రభుత్వం ధ్యేయమని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు. శనివారం గుమ్మలక్ష్మీపురం క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి మంచినీరు, రోడ్డు సౌకర్యం తదితర సమస్యలపై వినతిపత్రాలు అందించారు. సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ కద్రక కళావతి, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, గుమ్మలక్ష్మీపురం, టీడీపీ కురుపాం మండలాధ్యక్షుడు అడ్డాకుల నరేష్, కలిశెట్టి కొండయ్య పాల్గొన్నారు.కాగా జియ్యమ్మవలసలోని సత్యసాయిప్రశాంతి మందిరం నిర్మాణానికి ఎమ్మెల్యే జగదీశ్వరి రూ.50 వేలు మందిర నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళం అందించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జియ్యమ్మవలస, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సవరపు రవణ తెలిపారు. శనివారం చినమేరంగిలో విలేఖరులతో మాట్లాడుతూ ఆసక్తిగల వారు సోమవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను అదే రోజు సాయంత్రం కళాశాలలోనే స్క్రూట్నీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటిని జిల్లా ఇంటర్ ఎడ్యుకేషనల్ ఆఫీసుకు పంపించనున్నట్లు తెలిపారు. 15వ తేదీ ఉదయం 11 గంటలకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో డీఐఈవో ఆధ్వర్యంలో ఎంపికలు జరుగుతాయని చెప్పారు.

● వీరఘట్టం,జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర కళాశాలలో జంతుశాస్త్రం సబ్జెక్టును బోధించేందుకు అతిథి అధ్యాపకుని (గెస్ట్ ఫ్యాకల్టీ) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ ఒకప్రకటనలో తెలిపారు. సంబంధిత విద్యార్హతలు, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ఇతర సంబంధిత పత్రాలను దరఖాస్తుతో పొందుపరిచి సోమవారం మధ్యాహ్నం రెండుగంటల్లోగా కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల15న పార్వతీపురం జూనియర్ కళాశాల ఆడిటోరియంలో డీఐఈవో ఆధ్వర్యంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

● భామిని, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్, సివిక్స్, గెస్ట్ ఫ్యాకల్టీలో అధ్యాపకుల భర్తీకి సోమవారం మధ్యాహ్నం రెండు గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.వీఎల్.నారాయణరావు తెలిపారు.

భాసూరులో సత్యసాయి వ్రతాలు

పాలకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని భాసూరులో పాలకొండ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులు సత్యసాయి వ్రతాలు, భజనలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ సత్యసాయి సేవా సమితి ప్రతినిధి ఎన్‌వీ రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో సత్యం, అహింస, ప్రేమ, శాంతి ఉండాలన్నారు. సత్యసాయిబాబా బోధనలు భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్త సీహెచ్.శ్రీనివాసరావు, కన్వీనర్ ఎం.రమణ, జి.మధు పాల్గొన్నారు.

కార్టూన్ పోటీల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు

గరుగుబిల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగూరు గ్రామానికి చెందిన చిత్రకారుడు పల్ల పరిశినాయుడు చిత్రీకరించిన కార్టూన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. విశాఖ సంస్కృతిపై ఎన్‌సీసీఎఫ్ నిర్వహించిన పోటీల్లో రెండురాష్ట్రాలకు చెందిన పలువురు చిత్రకారులు పోటీల్లో పాల్గొనగా, పది మందిని ఎంపికచేశారని పరిశినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తానుచిత్రీకరించిన చిత్రాన్ని ఎంపిక చేశారని, ఆదివారం విశాఖలోని పబ్లిక్ గ్రంథాలయంలో విశాఖ సంస్కృతి 13వ వార్షికోత్సవ సభలో నిర్వాహకులు బహుమతి అందించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల పలువురు ఆయన్ను అభినందించారు. పర్యావరణాన్ని పెంచే చెట్లను నరికేందుకు సన్నద్ధమైన సమయంలో మరో అడవి ప్రాణి జింక చెట్టును కొట్టకుండా అడ్డుకున్న కార్టూన్‌ను చిత్రీకరించారు.

డాల్ఫిన్ల సంరక్షణపై అవగాహన



డాల్ఫిన్ల సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు

భామిని, జూలై 12 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఏకలవ్య పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు డాల్ఫిన్ల సంరక్షణపై ప్రిన్సిపాల్ జి.గంగాదేవి శనివారం అవగాహన కల్పించారు. పాఠశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డాల్ఫిన్ సంరక్షణపై ప్రతిజ్ఞ, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేటలో వాహనాల తనిఖీలు

సీతంపేట రూరల్,జూలై 12(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని పీఎంఆర్‌సీ జంక్షన్ వద్ద ట్రైనీ ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శనివారం వాహన తనిఖీలు చేపట్టారు.వాహన,డ్రైవింగ్ లైసెన్స్ ధ్రువపత్రాలను పరిశీలించారు. ధ్రువపత్రాలు లేని వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలుచేశారు.

పర్యవేక్షణ లేక.. పొదలు తొలగించక

● పాలకొండ-పార్వతీపురం రోడ్డులో నడుకూరు వద్ద పొంచిఉన్న ప్రమాదం

వీరఘట్టం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలకొండ- పార్వతీపురం ప్రధాన రహదారి నడుకూరు వద్ద పొదలు రోడ్డుపైనే ఉండడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా పొదలు తొలగింపు విషయంలో ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. రోడ్డుపైకి పొదలు ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం వర్షాకాలంలో కావడంతో పొదలు గుబురుగా పెరగడంతో ఈ మార్గంలో ప్రమాదం పొంచి ఉంది. విషజంతువులు సంచరించే అవకాశముందని పలువురు వాహన చోదకులు వాపోతున్నారు. ఇక్కడ చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే వారు భయాందోళనకు గురవుతున్నారు.



నడుకూరులో రహదారిపై ఉన్న పొదలు